# "బ్లాక్ మాజిక్"

—అన్వేషి

---

### 30–3–1963న మంగళాపురం కలెక్టరాఫీసు ఫైళ్ళలోకి వచ్చిన పిటిషన్, దానిపై కరణం, రెవిన్యూ ఇన్‌స్పెక్టరు, తాసీల్దారుల రిమార్కులు

మహారాజరాజశ్రీ మహాఘనత వహించిన మంగళాపురం కలెక్టరువారి దివ్య సమ్ముఖమునకు– తాటాకులపల్లి గ్రామ కాపురస్థులు అనేక నమస్కారములు చేసి వ్రాసికొన్న విన్నపములు—

ఘనమైన అయ్యా!

మా తాటాకులపల్లి గ్రామంలో మంచి నీటి యెద్దడి ఎక్కువగా వున్నదని సర్కారువారు యిదివరలో మా గ్రామానికి వచ్చియున్న సమయంలో మనవిచేసికొని యున్నాము మా గ్రామంలో షుమారు వెయ్యిన్ని అయిదువందలు జనాభా యున్నది. ఇందుకుగాను మా గ్రామంలో నీటి వాడకం నిమిత్తం మొత్తం మూడు బావులు ఒక దొరువు మాత్రమే వున్నవి. ఎండాకాలంలో సదరు దొరువు పూర్తిగా ఎండిపోయి వాడకానికి ఉపయోగం లేకుండా వుంటున్నది మూడు బావులలో కూడా నీళ్ళు ఎక్కడనో అడుగున వుంటున్నవి. మాకు యితర జలాధారాలు కూడా ఏమీ లేనందున గ్రామ ప్రజ మంచినీటి కోసం కటకట పడవలసి వస్తున్నది. అందువలన సర్కారువారిని మాపై దయవుంచి మా తాటాకులపల్లి గ్రామంలో చెరువును త్రవ్వించవలసినదిగా ప్రార్తిస్తున్నాము మా గ్రామం మధ్యలో మా గ్రామ కరణం అందాల అబద్ధయ్యగారికి ఏభై సెంట్ల స్థలం వున్నది. గ్రామ చెరువు కోసం సదరు స్థలాన్ని దాన రూపేణ యివ్వటానికి వారు వాగ్దానం చేశారు ప్రస్తుతం ఎమ్మెల్లేగా పని చేస్తున్న పంగనామాల రంగనాథం గారిది కూడా మా గ్రామమేనని సవినయంగా మనవి చేసికొంటున్నాము వారు కూడా మా గ్రామ చెరువు విషయమై చేతనైనంత సహాయం చేస్తామని వాగ్దానం చేసియున్నారు. కావున సర్కారువారు మాపై దయవుంచి మా గ్రామ చెరువు కోసం పదిహేను వేల రూపాయలు మంజూరు చేయించవలసినదిగా ప్రార్థిస్తున్నాము. ఘనత వహించిన సర్కారువారు చేసే ఈ ఈ సహాయానికి మా గ్రామస్థులు సర్వదా కృతజ్ఞులుగా వుండగలరని మనవి చేస్తున్నాము. చిత్తగించవలెను

గ్రామం: తాటాకులపల్లి. }
తేదీ – 15–3–1964 }

తమ విధేయులు
తాటాకులపల్లి గ్రామకాపురస్థులు
(కింద 50 సంతకాలు, 300 వేలిముద్రలు)

పై పిటిషన్‌పై కరణంగారి నోట్—

తాటాకులపల్లి గ్రామస్థులు వ్రాసికొన్న విన్నపంపై సదరు గ్రామకరణం వ్రాసికొన్నది పై గ్రామస్థులు వ్రాసికొన్న విన్నపాన్ని యిందు వెంట జతపర్చి పంపుకొనడమైనది. పిటిషన్‌లో గ్రామస్థులు వ్రాసికొన్న విషయాలన్నీ యథార్థాలేనని మనవి చేసుకొంటున్నాను. సదరు చెరువు కోసం ఆ గ్రామంలో వున్న నా 50 సెంట్ల స్థలాన్ని సర్కారువారికి అన్ని హక్కు భుకాలతో దాన పత్రం వ్రాసియివ్వగలనని కూడా మనవి చేసుకుంటున్నాను.

విధేయుడు.

తేదీ– 17–3–1954 } అందాల అబద్ధయ్య వ్రాలు
తాటాకులపల్లి గ్రామ విలేజి ఆఫీసరు.

25–3–1964 వ తేదీన రెవిన్యూ ఇన్‌స్పెక్టరు వ్రాసిన నోట్—

"తాటాకులపల్లి గ్రామస్థుల వద్ద నుండి వచ్చిన పిటిషన్‌పై వచ్చిన తాసిల్దారు గారి ఆర్డరు ప్రకారం తాటాకులపల్లి గ్రామాన్ని నిన్ననే విజిట్ చేసివచ్చాను. ఈ గ్రామంలో మొత్తం జనాభా షుమారు పదిహేను వందలున్నది. గ్రామంలో మూడు బావులు, ఒక దొరువు మాత్రమే వున్నవి, ఇవి ఈ గ్రామ ప్రజల నీటి అవసరాన్ని ఏ మాత్రం తీర్చలేవని గ్రామస్థులంతా చెప్పుకున్నారు చుట్టు ప్రక్కల 5, 6 మైళ్ళ దూరంలో ఎక్కడా ఏరుగాని, చెరువుగాని లేవు ఆ కారణంగా గ్రామ ప్రజలు నీటి కోసం యిబ్బందిపడుతున్న మాట వాస్తవమేనని దృఢపడుతున్నది. సదరు గ్రామ వి. ఓ. చెరువుకోసం 50 సెంట్ల స్థలాన్ని దానరూపేణా ఇస్తానని చెప్తున్నాడు. కొబట్టి చెరువుకు గవర్నమెంటువారు పదిహేనువేలు. మంజూరు చేయించవచ్చునని మనవి చేస్తున్నాను. వచ్చేది వర్షాకాలం కాబట్టి ఎంత త్వరలో చెరువు పనిని పూర్తి చేయిస్తే అంత మంచిదని కూడా తెలుపుకొంటున్నాను.

— రెవిన్యూ ఇన్‌స్పెక్టర్

28–3–1964 వ తేదీన తాసీల్దారు వ్రాసిన నోట్—

"పై చెరువు విషయమై నేను తాటాకులపల్లికి వెళ్ళినపుడు ఎంక్వయిరీ జరిపివచ్చాను. ఆ గ్రామానికి చెరువు చాలా అవసరమని రికమెండ్ చేస్తున్నాను."

1–3–1967 న మంగళాపురం కలెక్టరాఫీసుకు చేరిన పిటిషన్—

మహారాజరాజశ్రీ మహాఘనత వహించిన మంగళాపురం కలెక్టరు వారి దివ్య సమ్ముఖమునకు– తాటాకులపల్లి గ్రామ కాపురస్థుడు వ్రాసికొన్న విన్నపములు—

ఘనమైన అయ్యా!

సర్కారు వారు 1964 వ సంవత్సరంలో మా మనవి ప్రకారం మా తాటాకులపల్లి గ్రామంలో చెరువును త్వ్రించటం జరిగింది సదరు చెరువు వల్ల గ్రామంలోనీటి ఎద్దడి తీరుతుందని అనుకున్నాము. కానిసదరుచెరువువల్ల దోమలుఎక్కువై మా గ్రామంలో మలేరియా, కలరా మొదలైన అంటు వ్యాధులు వ్యాపిస్తున్నవి. అంతేగాక సదరు చెరువు నీటిలో పాములు, విషక్రిములు చేరి గడచిన మూడు మాసములలో ఆ నీళ్ళు త్రాగినవారు ముప్పై మంది చనిపోవటం జరిగింది. ఈ ఉపద్రవములే కాకుండా వానాకాలంలో చెరువుకట్ట తెగి చుట్టు

ప్రక్కల ఇండ్లు, పొలములు మునిగిపోతున్నవి. కట్ట తెగినపుడల్లా మా గ్రామములో నివారం పూడ్చడానికి ప్రయత్నం చేశాము, కాని సదరు కట్ట బురదనేలలో ఉండటం మూలాన్ని వేసిన కట్ట నిలుచుటలేదు. పైన వివరించిన కారణాలను పురస్కరించుకొని ఘనత వహించిన సర్కారువారిని మా గ్రామ చెరువును వెంటనే పూడ్పించే ఏర్పాటు చేయించవలసిందిగాను, మా గ్రామమును సదరు చెరువు నుండి కాపాడవలసినదిగాను ప్రార్థిస్తున్నాము చెరువును పూడ్పించుటకు అయిదు వేల రూపాయలు ఖర్చు అగునని అంచనావేయబడినది సదరు అయిదువేలలో, వెయ్యి రూపాయలు మాగ్రామస్తులు విరాళాల రూపేణా ఇవ్వగలరని మనవి చేసుకుంటున్నాము మిగిలిన నాలుగు వేలను సర్కారువారు గ్రాంటు రూపేణా మంజూరు చేయించవలసినదిగా ప్రార్థన చిత్తగించవలెను.

తమ విధేయులు

తేదీ— 25—2—1967 } తాటాకులపల్లి గ్రామ కాపురస్థులు (50 సంతకాలు, 300 వేలిముద్రలు)

పై పిటిషన్‌పై సదరు గ్రామకరణం వ్రాసినది—

మంగళాపురం కలెక్టరువారి దివ్య సమ్ముఖమునకు— తాటాకులపల్లి గ్రామకరణం వ్రాయు విన్నపములు

సదరు గ్రామస్తులు విన్నవించుకొన్న సంగతులన్నీ యథార్థాలేనని తెలుపుకొంటున్నాను. సదరు తాటాకులపల్లి గ్రామంలో సర్కారువారు త్రవ్వించిన చెరువులో నీళ్లుత్రాగి రోగం తెచ్చుకున్నవారిని, గడచిన మాసంలో సర్కారువారి ధర్మాసుపత్రికి పంపడం జరిగినది. కాని రోగులు డాక్టరుగారు రాక ముందే మరణించటం జరిగినది. దీనిని బట్టి సదరు చెరువు నీటివల్ల వస్తున్న రోగాలు ఎంత ప్రమాదకరమైనవో సర్కారువారే చిత్తగించగలరు ఇందు వెంట సర్కారువారి ధర్మాసుపత్రి డాక్టరు గారు యిచ్చినటువంటి సర్టిఫికెట్టును కూడా జతపర్చడమైనది. ఇంతేగాక మొన్న వర్షాలలో చెరువు కట్ట తెగి, నష్టపోయిన యిండ్ల తాలూకు యజమానులు నష్టపరిహారం దయచేయించమని సర్కారువారికి పెట్టుకున్న పిటిషన్‌లను కూడా యిందు వెంట పంపుకొనడమైనది. పైన వివరించిన కారణాల మూలంగా సర్కారువారు మాగ్రామంలోని వారి చెరువును త్వరలో పూడ్పించవలసినదిగా మనవిచేయడమైనది.

తేదీ— 26—2—1967 తాటాకులపల్లి వీ. ఓ

28—2—1967 న రెవిన్యూ ఇన్‌స్పెక్టరు నోట్—

తాటాకులపల్లి గ్రామస్థులవద్ద నుండి వచ్చిన పిటిషన్‌పై తాసిల్దారు గారి ఆర్డరుప్రకారం తాటాకులపల్లి గ్రామానికి ఈ దినమే స్పెషల్ విజిట్ వెళ్ళివచ్చాను, సదరు గ్రామంలో గ్రామస్థుల నుండి వచ్చిన పిటిషన్‌ను అనుసరించి 1964 సంవత్సరంలో సర్కారువారు ఒక చెరువును త్రవ్వించడం జరిగినది సదరు చెరువుపై వచ్చిన ఫిర్యాదులన్నీ విన్నాను చెరువును కూడా తనిఖీ చేశాను. సర్కారువారి చెరువులోని నీరు త్రాగి మరణించినందుకు వంద మంది గ్రామస్తులు సాక్ష్యం చెప్పారు. సదరు చెరువు నీళ్ళను పరీక్షించగా అవి అంటు రోగాలు తేవడానికి అన్ని విధాలా అనువుగా వున్నట్లు తేలినది ఇందుకు ఋజువుగా మన సర్కారు వారి ధర్మాసుపత్రి డాక్టరుగారు రేపు సర్టిఫికేట్ పంపిస్తానన్నారు. అంతేగాక వానాకాలంలో సదరు చెరువు కట్ట తెగి నీరు పూరినంతా ఆక్రమిస్తున్నట్లు కూడా గ్రామస్థులు చెప్పుకున్నారు. పైన వివరించిన విషయాల మూలంగా గ్రామస్థులు చెప్పిన విషయాలన్నీ యాదార్థాలని దృఢపర్చబడినందున తాటాకులపల్లి చెరువు విషయమై సర్కారువారు వెంటనే చర్య తీసుకొనవలసినదిగా ప్రార్థిస్తున్నాను ఈ విషయంలో జాప్యం జరిగితే గ్రామానికి కలిగే హాని యింతని చెప్పడానికి వీలుకాదని కూడా మనవిచేస్తున్నాను

— రెవిన్యూ ఇన్‌స్పెక్టరు

5—3—1967 న తేదీన సర్కారువారు జారీచేసిన ఆర్డర్—

"తాటాకులపల్లి గ్రామస్థుల వద్ద నుండి వచ్చిన విన్నపాన్ని, దానిపై వచ్చిన కరణం, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ల రిపోర్టులను పరిశీలించిన తర్వాత అంటువ్యాధులను కలిగించే సదరు గ్రామ చెరువును వెంటనే పూడ్పించవలసినదిగా ఆర్డర్ వేయడమైనది అందుకోసమై నాలుగు వేల రూపాయలు గ్రాంటు చేయడమైనది ఈ విషయమై వెంటనే చర్య తీసుకొని, 2—4—1967 లోపల ఆర్ ఐ రిపోర్టు పంపవలెను"

కలెక్టర్, మంగళాపురం

6—7—1968 న శాసనసభలో జరిగిన సంభాషణ—

ప్రతిపక్ష సభ్యుడు — "కళ్యాణపురం తాలూకా తాటాకులపల్లి గ్రామంలో చెరువును త్రవ్వించడానికి ప్రభుత్వం 1964 లో పదిహేను వేలు శాంక్షన్ చేసినట్లు తెలిసింది కాని ఆ గ్రామంలో యింతవరకు చెరువు త్రవ్వటం జరగలేదు కారణమేమిటి?"

మంత్రిగారు— "తాటాకులపల్లిలో చెరువు త్రవ్వించడం జరగలేదని గౌరవనీయుడైన సభ్యునకు యెలా తెలుసు? వారు ఆ నియోజక వర్గానికి చెందిన వారు కూడా కదా!"


ప్రతిపక్ష సభ్యుడు — ఆ గ్రామస్థులు కొందరు ఆ చెరువు విషయమై నాతో ఫిర్యాదు చేయగా నేను పోయిన నెలలో వెళ్ళి చూచిరావటం జరిగింది అక్కడ నాకెక్కడా చెరువు అనే పదార్థం కనిపించలేదు ప్రభుత్వం వారు చెరువు త్రవ్వించడమే జరిగితే ఆ చెరువు ఏమయింది? రెక్కలు వచ్చి ఎగిరిపోయిందా?"

మంత్రిగారు — "గౌరవనీయమైన సభ్యుని ప్రశ్నకు జవాబివ్వడానికి చెరువు తాలూకు ఫైళ్ళను పరిశీలించాలి అందుకు వారం రోజులు వ్యవధి యివ్వవలసినదిగా కోరుతున్నాను!"

మరోవారం తర్వాత శాసన సభలో మంత్రిగారి జవాబు—

"గౌరవనీయుడైన ప్రతిపక్ష సభ్యుని కోరిక ప్రకారం తాటాకులపల్లి చెరువు వ్యవహారం తాలూకు ఫైళ్ళను తెప్పించి క్షుణ్ణంగా పరిశీలించాను తాటాకులపల్లిలో చెరువును త్రవ్వించ

(54 వ పేజీ చూడండి)



"చెవులు రిక్కించి..."

ఫోటో: ఆర్. ఉదయభాస్కర్, తిరుచ్చిరాపల్లి-14

## బ్లాక్ మాజిక్

(15 వ పేజీ తరువాయి)

వలసినదిగా ఆ గ్రామస్తులు 15—3—1964 న పిటిషన్ పంపుకున్నారు. ఆ పిటిషన్‌పై ఎంక్వయిరీ జరిపి ప్రభుత్వం చెరువు కోసం పదిహేను వేల రూపాయలు గ్రాంటు చేసి. ఆ సంవత్సరం మధ్యలోనే తాటాకులపల్లిలో చెరువు త్రవ్వించటం జరిగింది కాని చెరువు త్రవ్వించిన ప్రాంతం బురదనేల కావటంవల్ల వర్షాకాలంలో చెరువుకట్ట తెగటం. చెరువునీరు వూరిని ఆక్రమించటం జరిగినది. అంతేగాక చెరువునీరులో విషక్రిములు చేరటం మూలాన ఆ గ్రామప్రజలలో మలేరియా. కలరా మొదలైన అంటువ్యాధులు వ్యాపించాయి ఈ విషయమై గవర్నమెంట్ డాక్టర్ల సర్టిఫికెటు కూడా ఫైల్లో వున్నది ప్రజారోగ్యశాఖవారు వ్యాధి నిరోధక చర్యలు తీసికొన్నా. చెరువునీరుమాత్రం విషపూరితంగానే వుండిపోవటం జరిగినది. 1967వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఆ గ్రామప్రజ చెరువును పూడ్పించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరింది దానిపై కలెక్టర్ ఎంక్వయిరీ జరిపించి అన్ని విషయాలు యదార్థాలేనని ఋజువైనందున 1967 మార్చి నెలలో చెరువును పూడ్పించటం జరిగింది."

ప్రతిపక్ష సభ్యుని కేకలు—"అబద్ధం! అంతా అబద్ధం! ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్నది. తాటాకులపల్లిలో చెరువును అసలు త్రవ్వించటమే జరగలేదు ఇక పూడ్పించటమేమిటి? గ్రామ కరణం, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఇతర అధికారులు కలసి ప్రజలసొమ్మును స్వాహాచేశారు?"

మంత్రిగారు— "అయ్యా! తమరు చెరువు పూడ్పించిన సంవత్సరానికి ఆ గ్రామానికి వెళ్ళిచూస్తే చెరువు మీకెక్కడ కనిపిస్తుంది! తమకీ విషయంలో ఇంకా అనుమానంవున్న పక్షంలో, ఆ గ్రామంలో పుట్టిపెరిగి, ప్రస్తుతం గౌరవనీయ సభ్యులైన పంగనామాల రంగనాథంగార్ని కూడా అడిగి చూడండి!"

ప్రతిపక్షసభ్యుడు — "రంగనాథంగారు యిండిపెండెంటు. ఆయన గోడమీది పిల్లివాటం! ఎంక్వయిరీ జరిపించండి! అసలు విషయం బయటపడ్తుంది!"

మంత్రిగారు — "ఈ చెరువు విషయమై యిప్పటికే మూడు సార్లు ఎంక్వయిరీ జరపటం జరిగింది. త్రవ్వించేముందు. ఆ తర్వాత మీరు ప్రశ్న అడిగినప్పుడు అందువల్ల మరల ఎంక్వయిరీ చేయించవలసిన అవసరం యేమిటో బోధపడ్డంలేదు. అవసరమైన పక్షంలో నా ఛాంబర్సుకువచ్చి చెరువు తాలూకు ఫైళ్ళను పరీక్షించవలసినదిగా గౌరవనీయమైన సభ్యుణ్ణి ఆహ్వానిస్తున్నాను. ప్రతిపక్ష సభ్యులకు నాదొక మనవి- ప్రభుత్వాన్ని విమర్శించటమే ప్రధానమైన పనిగా పెట్టుకోకుండా, తలపెట్టిన ప్రణాళికలకు ఉచితమైన మంచి సలహాలిస్తే ఎంతో సంతోషిస్తాను."

(హర్షాతిరేకంతో అధికారపక్ష సభ్యులు "సిగ్గు! సిగ్గు! కూర్చో! కూర్చో!" అని బల్లలు గుద్దుతారు. మంత్రిగారు మందహాసంచేస్తూ కూర్చుంటారు ప్రతిపక్ష సభ్యుడు వెర్రిమొగం వేసుకుని నిలబడే వుంటాడు)

(ఈ కథలోని పాత్రలు కేవలం కల్పితాలు.
స్థలంకూడా కల్పితమే!)